క్లుప్తంగా

పుస్తకాల వితరణ



గ్రంథాలయానికి పుస్తకాలను అందజేస్తున్న రామరాజు

పాతపట్నం: మండలంలోని ఆర్.ఎల్.పురం గ్రామంలో ఉన్న సరస్వతి పుస్తక నిక్షిప్త గ్రంథాలయానికి పాతపట్నం మండల కేంద్రానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పి.రామరాజు వివిధ రకాల పుస్తకాలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, స్టడీ మెటీరియల్స్, కాంపిటేటీవ్ పుస్తకాలను అందజేశామన్నారు. అన్ని రకాల వయసుల వారు చదావాల్సిన పుస్తకాలు ఉన్నాయన్నారు. యారబాటి సన్యాసిరావు, అంపోలు మన్మథరావు, కొయిబర్త కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు, పాతకులు పాల్గొన్నారు.

సజావుగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు

నరసన్నపేట: స్థానిక కోర్ టెక్నాలజీ సెంటర్లో ఆదివారం జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించారు. 640 మందికి కేటాయించగా 631 మంది పరీక్షలకు హాజరయ్యారు.

నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు

నరసన్నపేట: స్థానిక కోర్ టెక్నాలజీలో సోమవారం నుంచి ఏపీఈఏపీ సెట్ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేశారు. 19, 20 అగ్రికల్చరల్ పరీక్షలు, 21 నుంచి 27 వరకు ఇంజినీరింగ్ విభాగాల్లో పరీక్షలు జరగనున్నాయి. అంతా ఆన్‌లైన్ విధానంలో అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. కేంద్రానికి 30 నిమిషాల ముందే హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

రెండు కేంద్రాల్లో టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

నరసన్నపేట: మండల కేంద్రంలో సోమవారం నుంచి రెండు కేంద్రాల్లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. స్థానిక సెంట్ క్లారెట్ స్కూల్లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంఈఓ పి.దాలినాయుడు ఆదివారం తెలిపారు. ఈ కేంద్రాల్లో 690 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు సమయానికి హాజరుకావాలన్నారు.

రూ.1.20 లక్షల విరాళం



నగదు అందజేస్తున్న పొడ్డిని కుటుంబ సభ్యులు

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆపోజిట్ ఆర్‌ఆర్ కాలనీలో భీమలింగేశ్వర ఆలయ నిర్మాణానికి పొడ్డిని కైలాసరావు, కుమారులు హిమగిరి, శేషగిరి, కుటుంబ సభ్యులు రూ.1.20 లక్షలను అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధి సాదుబాబుకు ఆదివారం అందజేశారు. విరాళం అందజేసిన పొడ్డిని కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నోటీస్ జారీ

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలంలోని మోనింగు వారి చెరువు వద్ద కంచెలు వేసే పనులు అనుమతులు లేకుండా చేస్తున్నారని, వాటిని నిలుపుదల చేయాలని ఇన్‌చార్జి సెక్రటరీ శివాజీ ఆదివారం తెలిపారు. మేజర్ పంచాయతీ అనుమతి లేకుండా పనులు చేపడుతున్న వ్యక్తికి నోటీస్ జారీ చేశామన్నారు.

పనులు తక్షణమే ప్రారంభించాలి



తాత్కాలిక పనులను పరిశీలిస్తున్న ఏఈఈ ప్రసాదరావు

కొత్తూరు: మండలంలోని కొత్తూరు, సిరుసువాడ, కర్లెమ్మలతోపాటు పలు గ్రామాలకు చెందిన సాగునీటి చెరువులకు మంజూరైన పనులను తక్షణమే ప్రారంభించాలని పనుల కమిటీ సభ్యులకు నీటిపారుదల ఏఈఈ ప్రసాదరావు ఆదేశించారు. కొత్తూరులో ఆదివారం ఎస్.ఎస్.కాలనీ వద్ద రూ.5 లక్షలతో పాడైన చెక్ డ్యామ్ వద్ద ఇసుక బస్తాలతో నిర్మించిన తాత్కాలిక పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈఈ ప్రసాదరావు మాట్లాడుతూ.. మండలంలోని 21 పనులకు రూ.రెండు కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో చెరువుల మదుములు, సప్లాలతోపాటు పలు నిర్మాణ పనులు మాత్రమే చేపట్టడం జరుగుతుందన్నారు. వర్షాలు కురుస్తున్నందున పనులు జరిగే ప్రదేశాల వద్ద మెటీరియల్ వేయించాలన్నారు. ప్రభుత్వ నిధుల నుంచి ఎస్.ఎస్.కాలనీలోని తామర చెరువు సాగునీటి కాలువ అభివృద్ధికి మరో ఐదు లక్షలు మంజూరయ్యాయన్నారు. కాలువలో పూడికలు తొలగించడం జరుగుతుందన్నారు. నీటి సంఘం చైర్మన్‌లు చిట్టిబాబు, శ్రీరాములు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

కల నెరవేరేనా?



ఉర్లాం రైల్వే స్టేషన్

- అభివృద్ధికి నోచుకోని ఉర్లాం రైల్వే స్టేషన్
- కళగానే మిగులుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్
- ప్రస్తుతం పాసింజర్ ట్రైన్లకే హాల్ట్..
- కేంద్ర మంత్రి హామీ నెరవేరేదెప్పుడో..?

నరసన్నపేట: నియోజకవర్గంలో రెండు మండలాల ప్రజలకు అందుబాటులో ఉన్న ఉర్లాం రేల్వే స్టేషన్ ఎదుగూబొదుగూ లేకుండా ఉంది. ఏళ్లు కావస్తున్నా ఈ స్టేషన్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఎంపీలు వస్తున్నారు.. హామీలు ఇస్తున్నారు. కణిత విశ్వనాథం, అప్పయ్య దొర, కిల్లి కృపారాణి ఇలా ఎందరో హామీలు ఇచ్చారు. అయినా స్టేషన్ అభివృద్ధికి నోచుకోకపోగా అదనపు ట్రైన్లు హాల్ట్‌లు కూడా మంజూరు కావడం లేదు. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడు కూడా పలు మార్లు హామీలు ఇచ్చారు. తాజాగా కేంద్ర మంత్రి హోదాలో బొడ్డవానిపేట వద్ద నూకాలమ్మ చానల్‌పై వంతెన శంకుస్థాపనకు వచ్చి.. ఉర్లాం స్టేషన్ అభివృద్ధి, ఎక్స్‌ప్రెస్ ట్రైన్ హాల్ట్‌కు ప్రయత్నిస్తానని స్పష్టంగా మాట ఇచ్చారు. దీంతో స్థానిక ప్రజలు తమ చెంతనే ఉన్న ఉర్లాం రైల్వే స్టేషన్ అభివృద్ధి చెందుతుందని ఎంతగానో ఆశపడుతున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరుతున్నారు.

నెలకు లక్షకు పైగా ఆదాయం

ప్రస్తుతం ఉర్లాం రేల్వే స్టేషన్లో బ్రహ్మపూర్-విశాఖ, పలాస-విశాఖ, గుణ్‌పూర్- విశాఖ, విశాఖ-గుణుపూర్, విశాఖ-పలాస, విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ ట్రైన్లు అప్ అండ్ డౌన్‌లో ఆగుతున్నాయి. రోజుకు 90 నుంచి 110 మంది వరకు పాసింజర్ ట్రైన్లు ఎక్కుతున్నారు. నెలకు రూ.90 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఆదాయం పెరుగుదల అంతంతగానే ఉంది. ఎక్స్‌ప్రెస్ ట్రైన్లు హాల్ట్ మంజూరైతే ఆదాయం పెరుగుతుందని స్థానికులు అంటున్నారు.



స్టేషన్ మాస్టర్, టికెట్ కౌంటర్ గదులు

ఇంటర్ సిటీ హాల్ట్ కల్పించాలి..

ఇంటర్ సిటీ పాసింజర్‌గా ఉన్నప్పుడు ఉర్లాంలో హాల్ట్ ఉండేది. దీనిని ఎక్స్‌ప్రెస్ చేసిన తరువాత హాల్ట్ తీసేశారు. ప్రస్తుతం ఉర్లాంలో ఉదయం 6 గంటలకు బ్రహ్మపూర్-విశాఖ పాసింజర్ ట్రైన్ ఇక్కడ ఆగుతుంది. తరువాత సాయంత్రం 2.35కి పలాస-విశాఖ ట్రైన్ వస్తుంది. ఈ మధ్య సమయంలో విశాఖ వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. విశాఖ నుంచి ఉర్లాం వచ్చేందుకు ఉదయం 11.20కి విశాఖ-పలాస పాసింజర్ ఉంది. రాత్రి 8.30కి విశాఖ-బ్రహ్మపూర్ వస్తుంది. ఇంటర్ సిటీ హాల్ట్ లభిస్తే ప్రయాణికుల రాకపోకలకు వీలుగా ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి



ఉర్లాం రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తే జలుమూరు, నరసన్నపేట మండలాల్లో వందకు పైగా గ్రామాలకు మేలు జరుగుతుంది. ఈ ప్రాంత ప్రయాణికులకు రైల్వే సౌకర్యం పెరుగుతుంది. ఈ ప్రాంతంలో ఆర్మీ, పారామిలట్రీ బలగాల్లో అనేక మంది పని చేస్తున్నారు. అలాంటి వారి రాకపోకలకు వీలు అవుతుంది. రైల్వే స్టేషన్లు అనేకం అభివృద్ధి చెందుతున్నా.. దీని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుత కేంద్ర మంత్రి ఇచ్చిన హామీ నిలబెట్టు కోవాలి.

– ధర్మాన జగన్, లింగన్నాయుడుపేట, జలుమూరు మండలం

హామీలే మిగులుతున్నాయి



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి ఉర్లాం స్టేషన్ అభివృద్ధి చేస్తామని, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్‌లు కల్పిస్తామని నాయకులు హామీలు ఇస్తున్నారు. గతంతో పోల్చితే ప్రయాణికుల సంఖ్య పెరిగింది. స్టేషన్ మాత్రం అభివృద్ధి చెందడం లేదు. ప్రయత్న లోపమే దీనికి కారణమని అనుకుంటున్నాం. ఇప్పటికైనా నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. ఉర్లాం రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసి ఎక్స్‌ప్రెస్ ట్రైన్లకు హాల్ట్ కల్పించాలి.

– పోలాకి నర్సింహమూర్తి, సర్పంచ్, ఉర్లాం

వైభవంగా వెలగపోలమ్మ ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మెళియాపుట్టి: మండలంలోని శేఖరాపురంలో గ్రామ దేవత వెలగపోలమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు ఉత్సావాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మొదటిరోజు తాళాలతో ఆలయానికి చేరుకుని ముర్రాటలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవాకి ఉపవాస పిలుపు కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని ప్రతి ఇళ్లూ బంధువులతో కళకళలాడుతోంది. గ్రామ ప్రజలను దీవించాలని తల్లిని కోరుకున్నారు. ఆలయాన్ని విద్యుత్ కాంతులతో తీర్చిదిద్దారు.

ఆత్మీయ సమ్మేళనం



1995, 98 టెన్త్ బ్యాచ్‌ల విద్యార్థులు

హిరమండలం: మండలంలోని తులగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995, 98 సంవత్సరాల్లో పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక బ్యారేజీ సెంటర్‌లోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. రోజంతా సందడిగా గడిపారు.

తాగునీరు వృథా



కొత్తూరులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ రోడ్డు సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మెగా వాటర్ పైపులైన్ లీక్ అయింది. నెలల తరబడి తాగునీరు వృథాగా పోతోంది. పారాపురానికి తాగునీరు పూర్తిస్థాయిలో వెళ్లకపోవడంతో ఆ గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి వాల్ లీక్‌ను కట్టడి చేయాలని పారాపురం గ్రామస్తులు కోరుతున్నారు.

– కొత్తూరు

అసంపూర్తిగా..



సరుబుజ్జిలి మండలంలోని మతలబుపేటలో వెల్‌నెస్ సెంటర్ పనులు పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. పనులు నిలిపివేయడం వలన నిరుపయోగంగా ఉన్న భవనాన్ని ప్రైవేట్ అవసరాలకు వినియోగిస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంది. వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం నిలిచిపోవడంతో సచివాలయంలో ఆరోగ్య శాఖ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

కళ్లల్లో పడుతున్న ఇసుక..



ఈ చిత్రం నరసన్నపేట మండలంలోని సత్యవరం జంక్షన్ వద్ద ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో టార్పాలిన్ లేకుండా ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్. జాతీయ రహదారిపై ఇసుక ట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు, పాదచారుల కళ్లల్లో ఇసుక రేణువులు పడి ఇబ్బంది పడుతున్నారు. గోపాలపెంట, కరజాడ, మడపాం, బుచ్చిపేటల నుంచి ఇసుక ట్రాక్టర్లు నిత్యం తిరుగుతున్నాయి. విధిగా ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌పై టార్పాలిన్ కప్పి వెళ్లాలని పోలీసులు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. ఇటువంటి ట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– నరసన్నపేట

చెరువును తలపించేలా గోతులు



ఎల్.ఎన్.పేట మండలంలోని అలికాం-బత్తిలి (ఏబీ) ప్రధాన రహదారి మోదుగువలస నుంచి గొట్టిపల్లికి వెళ్లే రోడ్డు చెరువును తలపిస్తోంది. మోదుగువలస నుంచి కొమ్మువలస మీదుగా గొట్టిపల్లి వరకు సుమారు ఐదు కిలో మీటర్ల ఉన్న ఈ రోడ్డులో మరో ఐదు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రెండు దశాబ్దాలకు పైగా మరమ్మతులు చేపట్టకపోవటంతో పెద్ద, పెద్ద గోతులు ఏర్పడ్డాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

తిరంగా ర్యాలీ



ఆమదాలవలస: తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

నరసన్నపేట: ఆపరేషన్ సిందూరుతో పాక్‌కు బుద్ధి చెప్పిన భారత సైనికులకు మద్దతుగా నరసన్నపేటలో ఆదివారం తిరంగా యాత్ర ర్యాలీ నిర్వహించారు. పట్టణానికి చెందిన విద్యా సంస్థల ప్రతినిధులు, విశ్రాంత పారా మిలట్రీ, ఆర్మీ ఉద్యోగులు, పట్టణ వర్తకులు, యువత, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. తిరంగా ర్యాలీని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. జూనియర్ కళాశాల మైదానం నుంచి పల్లిపేట కూడలి వరకు ర్యాలీ చేపట్టారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: పట్టణంలో భారత సైన్యానికి అండగా మేము సైతం అంటూ తిరంగా ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆధ్వర్యంలో వన్ వే జంక్షన్ వద్ద గల గాంధీ విగ్రహం నుంచి కృష్ణాపురం కూడలి వరకు, అక్కడి నుంచి గాంధీ విగ్రహం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పహల్గాం దాడిలో మరణించిన భారతీయులకు నివాళులర్పించారు. అన్ని శాఖల అధికారులు, మహిళా సంఘాలు సభ్యులు, మాజీ సైనికులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.



నరసన్నపేట: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు

23న వేంకటేశ్వరస్వామి కల్యాణం

సరుబుజ్జిలి: ఈ నెల 23న పురుషోత్తపురం గ్రామంలో గల లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణ ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త నానుపాత్రుని రామమూర్తి ఆదివారం తెలిపారు. తమ్మినేని కోదండరామాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వైస్ ఎంపీపీ ఎన్నికకు సర్వం సిద్ధం



ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

సారవకోట: వైస్ ఎంపీపీ ఎన్నికకు మండల పరిషత్ సిబ్బంది అంతా సిద్ధం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఎం.లోకనాథం ఆదివారం తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వైస్ ఎంపీపీ (పెద్దలంబ ఎంపీటీసీ సభ్యుడు) యడ్ల అసిరయ్య మృతి చెందారు.

విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణకు అవకాశం

ఆమదాలవలస: పట్టణ గృహ విద్యుత్ వినియోగదారులకు 50 శాతం రాయితీతో అదనపు విద్యుత్ లోడును క్రమబద్ధీకరించుకోవచ్చునని విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ జి.రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం జూన్ 30వ తేదీ వరకు మాత్రమే ఉంటుందన్నారు. సమీపంలో ఉన్న మీ-సేవ కేంద్రంలో, ఈపీడీసీఎల్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకొని తగిన చార్జీలు చెల్లించి అదనపు విద్యుత్ లోడును క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. అదనపు విద్యుత్ ధర కిలో వాట్‌కు రూ.2,250 కాగా.. తగ్గింపు ధర రూ.1,250, రెండు కిలో వాట్‌లకు రూ.4,450 కాగా.. తగ్గింపు ధర రూ.2,250, మూడు కిలో వాట్‌లకు రూ.6,650 అయితే.. తగ్గింపు ధర రూ.3,650, నాలుగు కిలో వాట్‌లకు రూ.8,850 కాగా.. తగ్గింపు ధర రూ.4,850, ఐదు కిలో వాట్‌లకు రూ.11,050 అయితే.. తగ్గింపు ధర రూ.6,050 చెల్లించవచ్చన్నారు.

పరామర్శ..



చిన్నమ్ముడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి శాంతి, నాయకులు

కొత్తూరు: మండలంలోని రెండు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం పరామర్శించారు. మెట్టూరు బిట్-3 ఆర్‌ఆర్ కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొట్ట రమణమ్మ అత్త లక్ష్మి ఇటీవల మృతి చెందారు. నేరడి సర్పంచ్ నక్క చిన్నమ్మడు అత్త అక్కమ్మ ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందారు. ఆయా కుటుబాలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకుడు చింతాడ సూర్యనారాయణ, మండల అధ్యక్షుడు గండివలస ఆనంద రావు, గొట్ట లక్ష్మణరావు, నక్క వెంకటరావు, నిమ్మగడ్డ కృష్ణారావు, వనుము లక్ష్మీనారాయణ, అంపిలి బుచ్చిబాబు, తమ్మినాయుడు, పిన్నింటి శేషగిరి ఉన్నారు.

జూదరుల అరెస్ట్

కొత్తూరు: మండలంలోని మురళిపేట సమీపంలో జూదం శిబిరంపై ఎస్ఐ ఎండీ ఆమీర్ అలీ, పోలీసులు ఆదివారం దాడి చేశారు. జూదం ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5,760 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పొందూరు మండలంలో..

పొందూరు: మండలంలోని తండ్యాం పంచాయతీ లక్ష్మీపురం గ్రామం సమీపంలో జూద శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా చేసిన దాడిలో ఆరుగురు జూదరులు పట్టుబడ్డారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం జూద శిబిరంపై దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ.20,400 నగదు, ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

అందని గౌరవ వేతనం..!

- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలకు మొండిచేయి
- కూటమి నాయకులకే ప్రాధాన్యం
- ప్రజాప్రతినిధుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం

హిరమండలం: ప్రజా సంక్షేమాన్నే కాదు.. ప్రజాప్రతినిధుల సంక్షేమాన్ని కూడా కూటమి ప్రభుత్వం విస్మరిస్తోంది. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారి సహనాన్ని పరీక్షిస్తోంది. ఎంపీటీసీ సభ్యులకు నెలకు రూ.3 వేల చొప్పున గౌరవవేతనం ఇవ్వాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండు విడతల్లో ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికల కారణంగా గత ప్రభుత్వ ఎంపీటీసీలకు వేతనాలు చెల్లించలేకపోయింది. జూన్ 2024లో కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అంతకు ముందు పెండింగ్‌లో ఉన్న వేతనాలతోపాటు కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి (సుమారు 20 నెలల) నుంచి వేతనాలు రావాల్సి ఉంది. గౌరవ వేతనం మంజూరు చేయక పోవడంతో అధికార, విపక్ష ఎంపీటీసీ సభ్యులు అనే తేడా లేకుండా ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారు. ప్రజలతో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఈ ప్రభుత్వం ఏమాత్రం గౌరవం ఇవ్వడంలేదు. సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో కూటమి నాయకులకే వారికే ప్రాధన్యం ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నుంచి సర్వసభ్య సమావేశాలకు హాజరుకావడమే తప్ప.. ప్రజల సమస్యలను పరిష్కరించాలని మండల అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకున్న పాపాన పోలేదని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు వాపోతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో 74 మంది, నరసన్నపేట నియోజకవర్గంలో 74 మంది, ఆమదాలవలస నియోజకవర్గంలో 70 మంది ఎంపీటీసీ సభ్యులున్నారు.



హిరమండలం మండల పరిషత్ కార్యాలయం

గౌరవ వేతనం మంజూరు చేయాలి



ఎంపీటీసీలకు కూటమి ప్రభుత్వం గౌరవ వేతనాలతోపాటు నిధులు, అలవెన్స్‌లు కూడా ఇవ్వడం లేదు. సభలు, సమావేలకు మండల కేంద్రానికి వచ్చిపోవాలంటే ఖర్చుతో కూడుకున్న పని. కూటమి ప్రభుత్వం స్పందించి గౌరవ వేతనాలు వెంటనే మంజూరు చేయాలి.

– వంగపల్లి సావిత్రి, వైస్ ఎంపీపీ, హిరమండలం

20 నెలలుగా అందడం లేదు



దాదాపు 20 నెలలుగా గౌరవ వేతనం అందలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క నెల కూడా గౌరవ వేతనం చెల్లించలేదు. ఎప్పుడు వస్తుందని అధికారులను ప్రశ్నిస్తే స్పష్టమైన సమాధానం చెప్పలేకపోతున్నారు. సీఎం చంద్రబాబు స్పందించి గౌరవ వేతనాలు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఉలకాపు సావిత్రి, ఎంపీటీసీ, అంబావల్లి, హిరమండలం

సకాలంలో చెల్లింపులు..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సకాలంలో గౌరవ వేతనం వచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాప్రతినిధుల గౌరవ వేతనం చెల్లింపుల్లో నిర్లక్ష్యం చేస్తోంది. ఇది ప్రభుత్వానికి తగదు.

– మీసాల రజినీ, ఎంపీటీసీ, హిరమండలం

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను సత్కరిస్తున్న డీఈ శ్రీకాంత్, తదితరులు

ఎల్.ఎన్.పేట: విద్యార్థుల్లో పోటీతత్వం ఉన్నప్పుడే చదువుల్లో రాణిస్తారని ఇరిగేషన్ డీఈ కొత్తకోట శ్రీకాంత్ అన్నారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం చింతలబడవంజ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. పదో తరగతిలో పర్లాపు యమున (593), సనపల జ్ఞానసాయి (516)తోపాటు బొడ్డేపల్లి అశోక్ కుమార్, ఇంటర్‌లో సనపల జయశ్రీ (971), పర్లాపు తనూజ (721), పెద్దింటి నందినిని అభినందించారు. వారికి జ్ఞాపికలను అందించి సత్కరించారు. పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డీఈ మెట్ట సతీష్, ఏపీ ఐబీసీ జూనియర్ మేనేజర్ కొత్తకోట వెంకటేష్, యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురవరపు జయరాం, నమ్మి సురేష్, పర్లాపు రమణ, ఎం.జనార్దనరావు, సీర రమేష్, బొడ్డేపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.